క్లుప్తంగా

పోలేరమ్మ జాతర ప్రారంభం



వేమవరం(భట్టిప్రోలు): మండలంలోని వేమవరంలో కొలువైన పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో ఆదివారం అమ్మవారికి చద్ది నైవేద్యాలు సమర్పించారు. ఈ నెల 26న రెండవ వారం చద్ది నైవేద్యాలు జరుగుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. జూన్ 1న చద్ది వద్దన, 7న అమ్మవారికి మొక్కుబడులు చెల్లింపుఉన్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న స్థానికులు అమ్మవారి జాతర మహోత్సవానికి విచ్చేయాలని కోరారు.

వైభవంగా అంకమ్మ తల్లి కొలుపులు



రేపల్లె రూరల్: మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత అంకమ్మ తల్లి కొలుపుల మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. సకాలంలో వర్షాలు పడి తీరం పచ్చని పంటలతో శోభిల్లాలని కోరుతూ అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు, గాజులు, సద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రపంచ విప్లవ నాయకుడు హోచిమన్


తెనాలి: ప్రపంచ విప్లవ నాయకుడు, వియత్నాంఅధ్యక్షుడిగా పనిచేసిన హోచిమన్ జయంతిని ఇక్కడి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కొల్లిపర కార్యక్రమానికి తుంగా బాలస్వామి అధ్యక్షత వహించారు. సంస్థ జాతీయ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ హోచిమన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ సాంస్కృతిక విభాగం కార్యదర్శి బెల్లంకొండ వెంకట్, ఇస్కఫ్ సభ్యులు ఆలూరి సత్యేంద్రనాథ్, కాకుమాను గోపాలకృష్ణ, నాగరాజు, శ్రీదేవి, బెజ్జంకి నాగమణి, విజయసారథి పాల్గొన్నారు.

పోలీసు కవాతు



తెనాలిరూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి చినరావూరుతోట ప్రాంతంలో కవాతు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో అలజడులు రేగకుండ చర్యలు తీసుకున్నామని, కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలానే రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అంగలకుదురులో ఆదివారం రాత్రి రూట్ మార్చ్ నిర్వహించారు.

అన్నమయ్య పాటల పోటీలకు విశేష స్పందన



తెనాలిఅర్బన్: అన్నమాచార్యుల జయంతి సందర్భంగా సంకీర్తన పోటీలు ఆదివారం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ఆవరణలోని గీతా మందిరంలో పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగంలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఆల్ ఇండియా రేడియో అనౌన్సర్, న్యూస్ అసిస్టెంట్ ఎడిటర్ కేఎస్ పూర్ణచంద్రిక వ్యవహరించారు. నిర్వాహకులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల్లో భక్తి భావం పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో లక్కరాజు కనకదుర్గ, అందె బాలచంద్రమౌళి, పి.వంశీకృష్ణ, కె.రమాదేవి, వి.లక్ష్మీరజిని, బి.శాంతి, ఎ.రాజేశ్వరి పాల్గొన్నారు.

రీసైక్లింగ్.. బాపట్ల క్లీనింగ్

- బాపట్లకు తీరిన చెత్త సమస్య
- జమ్ములపాలెం డంపింగ్ యార్డులో రీసైక్లింగ్
- 34 మెట్రిక్ టన్నుల చెత్తను వేరు చేసే యంత్రం
- 15 క్లస్టర్లుగా చెత్త సేకరణకు ప్రణాళికలు
- ఆశించిన మేరకు విజయం
  : శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య



చెత్తను రీసైక్లింగ్ చేస్తున్న పనులు

బాపట్ల: బాపట్ల పట్టణం క్లీన్ అవుతోంది. పక్కా ప్రణాళికతో చేపట్టిన చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన బాపట్లలో ఈప్రణాళిక ఎంతో ఉపయోగకరంగా ఉంది.

ప్రతి ఇంటికి ఓ నివేదిక

బాపట్ల పట్టణంలో ప్రతి ఇంటి నుంచి తడి చెత్త ఎంత, పొడి చెత్త ఎంత వస్తోందని పారిశుద్ధ్య కార్మికులు సేకరించే చెత్తతో పాటు రాత పూర్వకమైన రికార్డు పనులను సచివాలయం ఉద్యోగులకు అప్పగించారు. బాపట్లలో 300 నుంచి 350 ఇళ్లకు ఒక మైక్రో ప్యాకెట్‌గా విభజించారు. 15 మైక్రో ప్యాకెట్లు కలిపి ఒక క్లస్టర్ కింద గుర్తించి, మొత్తం 5 క్లస్టర్లగా పట్టణంలో మొత్తం చెత్త సేకరించే పనులకు శ్రీకారం చుట్టారు. రోజు 34 మెట్రిక్ టన్నుల చెత్త బాపట్లలో ఉత్పత్తి అవుతుందని గణాంకాలు తయారు చేసి, దీనిని రీసైక్లింగ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

జమ్ములపాలెం డంపింగ్‌యార్డు వద్ద..

బాపట్ల మున్సిపాలిటీలో డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవటంతో ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి ఏనిమిదేళ్ల క్రితం జమ్ములపాలెం రోడ్డులో 15 ఎకరాల పొలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించారు. ఈ డంపింగ్ యార్డులో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయటం వల్ల కనీసం 7 నుంచి 8 అడుగులు ఎత్తులో పేరుకుపోయింది. డంపింగ్ యార్డులోకి ప్రవేశించాలన్న తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉన్న చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

కేవలం రూ.80 వేలు చేసే మిషన్‌ను తీసుకువచ్చి దాని నుంచి చెత్తాచెదారం, మట్టిని వేరు చేసే పనులు చేపట్టారు. ఈ విధంగా వచ్చిన మట్టిని వర్మీ కంపోస్టులో ఉపయోగించేవిధంగా నిర్ణయం తీసుకున్నారు.



ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్తను సేకరిస్తున్న కార్మికులు



చెత్త సేకరించాల్సిన ప్రాంతాల మ్యాపును ఏర్పాటు చేసిన అధికారులు

ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు

పొడి చెత్త,తడి చెత్తను అందించే విషయంలో బాపట్ల ప్రజల సహకారం బాగా ఉందని మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య తెలిపారు. సచివాలయం ఉద్యోగుల సహకారంతో చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. చెత్తను కూడా రీసైక్లింగ్ చేసిన తర్వాత డంపింగ్ యార్డులో నర్సరీని ఏర్పాటు చేసేందుకు ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు.

పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



భట్టిప్రోలులో సుందరయ్య చిత్రపటానికి నివాళి

రేపల్లె రూరల్: స్వాతంత్ర్య సమర యోధుడిగా, దక్షిణ భారతదేశ కమ్యునిస్టు పార్టీ నిర్మాతగా, ఆంధ్రరాష్ట్ర శాసన సభ నేతగా, పార్లమెంట్ సభ్యుడిగా పుచ్చలపల్లి సుందరయ్య అందించిన సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పుచ్చలపల్లి నిరాడంబర జీవితం సాగిస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. కార్మికులు, రైతుల కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆయన బాటలో సీపీఎం శ్రేణులు నిరంతరం పయనిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాలు నేతలు కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, ఆగస్టిన్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూచిపూడిలో కామ్రేడ్ సుందరయ్యకు ఘన నివాళి

అమృతలూరు(భట్టిప్రోలు): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్ మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన ధన్య జీవి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, తాతయ్య, సంసోను పాల్గొన్నారు.

సుందరయ్య చిత్రపటానికి నివాళి

భట్టిప్రోలు: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు శాఖ కార్యదర్శి ఎం. సత్యన్నారాయణ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి అంటరానితనం , భూస్వామ్య దోపిడీపై తన గ్రామం నుంచే పోరాటాలు నడిపిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, అహరోను, మనోజ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.



రేపల్లె పట్టణంలో కురుస్తున్న వర్షం

ఎండా వాన..
దాగుడు మూతలు

రేపల్లె రూరల్: రేపల్లె తీర ప్రాంతంలో గత రెండు రోజుల నుంచి భిన్న వాతావరణంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రేపల్లె పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొంత సేపు వాన పడి, మరికొంత సేపు ఎండ కాస్తోంది. ఎప్పుడు వర్షం కురుస్తుందో, ఎప్పుడు ఎండ కాస్తుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. అప్పటి వరకు ఎండ అధికంగా ఉన్నా.. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కొంత సేపు వర్షం కురుస్తోంది. మరలా ఎండ తీవ్రత అధిక మౌతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. రేపల్లె పట్టణంలో 2.2మి.మీ, నగరంలో 1.8మి.మీ, చెరుకుపల్లిలో 2మి.మీ, నిజాంపట్నంలో 3.4మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.



భట్టిప్రోలులో కురుస్తున్న వర్షం



జెండా చెట్టు రహదారిపై చేరిన మురుగు నీరు

వీడని వర్షం

భట్టిప్రోలు: మండలంలో గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమవుతున్నా యి. ఈ వర్షపు నీరు, డ్రైయినేజీ నీరు ఏకమై రహదారులపై పారుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో స్థానికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజ లు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం కొంత సేపు వర్షం, మరి కొంత సేపు ఎండ కాస్తూ వాతావరణం దోబూచులాడింది.

చదువు పేరుతో ఒత్తిడికి గురిచేయొద్దు

బాపట్ల: పిల్లలను చదువు పేరుతో ఒత్తిడికి గురి చేయకుండా వారిలోని ఆసక్తిని గమనించి చదివించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల, స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బాపట్ల రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన 'ఈ తరంలో మేము ప్రత్యేకము' స్టూడెంట్స్ సమ్మర్ వర్క్ షాప్ ముగింపు సభకు ముప్పలనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంచి సంకల్పం ఉంటే ఎంతటి క్లిష్టమైన పనులనైనా సాధించవచ్చన్నారు. 'ఈ తరంలో మేము ప్రత్యేకం' అనే నినాదంతో ఆరోగ్యకరమైన భావి భారత సమాజ స్థాపనకై అహర్నిశలు కృషి చేస్తున్న స్టూడెంట్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు పిన్నిబోయిన శ్రీమన్నారాయణ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీర రాఘవయ్య, రొటీరియన్ సుధీర్ బాబు, ప్రకృతి వైద్యుడు డాక్టర్ కే శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పలనేని శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని, వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కంజుల సత్యనారాయణరెడ్డి నిర్విరామ ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం మొదలైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్యనారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయుక్తంగా 10 లక్షల పారిజాత పుష్పాలతో తొలుత స్వామివారికి విశిష్ట అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని స్మరించుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నామధేయాలు ఉచ్చరిస్తూ, వారిని తిరుగులేని ఆధిక్యంతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా కంజుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని అన్నారు. పేదరిక నిర్మూలన జరిగి నవ సమాజ నిర్మాణం జరిగేందుకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడుతూ ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే బాధ్యతయుతమైన పౌరులుగా తాము వైఎస్సార్ సీపీ అఖండ విజయాన్ని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజునే కాకుండా, దీన్ని ఒక నిరంతరం ప్రక్రియగా కొనసాగిస్తామని వెల్లడించారు. నిత్య పూజాధికాలలో టి.వెంకటేశ్వరరెడ్డి, బలరామిరెడ్డి, కంజుల సూర్యకుమారి, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం

పెట్రోల్ బంకులకు నోటీసులు

తెనాలిరూరల్: ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో వాటిని ఉల్లంఘించరాదని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు చెప్పారు. ఎన్నికల సందర్భంగా అక్కడక్కడ జిల్లాలో స్వల్ప ఘటనలు జరిగిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల 4న కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే పెట్రోల్ బంకుల యాజమాన్యాలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విడిగా బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ పోయకూడదన్నారు. ఈ మేరకు బంకుల నిర్వాహకులకు ఆదివారం నోటీసులు అందించినట్లు చెప్పారు. విధిగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ అన్నారు. మండలంలోని వేజండ్ల, నారాకోడూరు తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.మహేష్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున, తర్వాత ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతవరణం కొనసాగించాలని సూచించారు. మండల పరిధిలోని మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల, వడ్లమూడి, గ్రామాల పరిధిలోని పెట్రోలు బంకు యజమానులకు డబ్బాలు, బాటిల్స్, విడిగా ఇతర వస్తువులలో పెట్రోలును నింపి విక్రయాలు చేయవద్దని ఆదేశించారు. బంకు యజమానులకు నోటీసులు అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు కేవలం వాహనదారులకు మాత్రమే పెట్రోలు, డీజిల్‌ను నింపాలని సూచించారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ పి.మహేష్ కుమార్ హెచ్చరించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం



తక్కెళ్ళపాడు గ్రామంలో కోలాహలంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో చౌడేశ్వరి అమ్మవారు

పెదకాకాని: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 16 జ్యోతులతో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ గ్రామోత్సవం జరిగింది. ఈ అమ్మవారి జ్యోతుల ప్రదర్శన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఆడపడుచులు, బంధుమిత్రులు స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పొంగలి నైవేధ్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలతో తొగట వీరులు కత్తులు, నారజములు, పసుపు కొమ్ములతో జలది దగ్గరకు వెళ్లి బండారు కొట్టుట జరిగింది. రాత్రి 10 గంటలకు జ్యోతుల తయారు చేసి మేళ తాళాలు, భజనలు, తీన్‌మార్ తప్పెట్ల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రాత్రంతా జ్యోతుల ప్రదర్శనతో వైభవంగా జరిగింది. గ్రామోత్సవాన్ని ప్రజలు ఆహ్వానించి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి స్వాగతం పలికారు. రాత్రంతా జ్యోతుల జాతర చోటు చేసుకుంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వేలాదిగా తరలి వచ్చిన భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు.


శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్

గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యి.. కౌంటింగ్ దగ్గరపడుతున్న సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా.. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆదివారం స్వర్ణభారతి నగర్‌లో నిర్వహించిన కవాతుకు సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, శాంతిభద్రతలను కాపాడే క్రమంలో కవాతు నిర్వహించటం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయని, అదేవిధంగా వచ్చే నెలలో జరిగే కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజా సంరక్షణ పోలీస్ బాధ్యతగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. కాలనీలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యను నిర్లక్ష్యం చేయరాదు

లక్ష్మీపురం: గ్యాస్ సమస్య నివారణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో లివర్, జీర్ణకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సమస్య ప్రమాదకరమైంది కాదన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు మీదకు వచ్చేంత గందరగోళానికి గురిచేస్తుందన్నారు. అన్నవాహికకు జీఈఆర్‌డీ సమస్య, కార్సినోమా సమస్య ఉత్పన్నమవుతాయని, ఈ సమస్యతో బాధపడేవారు పులుపు కలిగిన పండ్లను, చాక్లెట్లను, టమాట, వెల్లుల్లి, ఉల్లి, వేయించిన వస్తువులు, కూల్‌డ్రింక్స్, ఫ్యాటీ ఫుడ్స్, ఆల్కహాల్ వంటి వాటిని దూరం పెట్టాలన్నారు. తిన్న వెంటనే పడుకోరాదని, తక్కువ ఆహారం ఎక్కువసార్లు తీసుకుంటే మంచిదన్నారు. బరువును అదుపులో ఉంచుకోవాలని, పొట్టలో యాసిడ్స్ ఎక్కువగా ఉత్పన్నమైతే స్టమక్ అల్సర్, స్టమక్ క్యాన్సర్‌కి దారితీస్తుందన్నారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్రరావు, శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య ఉచిత శిబిరం



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయమవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన వైద్యంలో ఆయుర్వేద వైద్యం ప్రఖ్యాతిగాంచిందన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం అందజేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి, అర్హులకు రూ.60 వేలు విలువైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.